‘రైతుబంధు’ అందేనా?

- ప్రారంభించి 25 రోజులు కావస్తున్నా పూర్తిస్థాయిలో అందని యాసంగి పెట్టుబడి సాయం
- ఆందోళనలో అన్నదాతలు

ఖిల్లాఘనపురం: అన్నదాతలు పంటలు సాగు చేసే సమయంలో పెట్టుబడి లేక వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చుకునేవారు. అప్పులు కట్టలేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. వీటిని గమనించిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులు అప్పులు తెచ్చుకోకుండా వారికి అవసరమైన పెట్టుబడి సాయాన్ని అందించాలనుకుంది. వానాకాలం, యాసంగి రెండు పంటలకు పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.5 వేల చొప్పున సంవత్సరానికి రూ.10 వేల అందజేసేందుకు రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వం మారిపోయింది. ఈ యాసంగి పంటల పెట్టుబడి సాయం నేటికీ పూర్తిస్థాయిలో అందకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన ప్రభుత్వం ఇప్పటికైనా త్వరితగతిన పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

6,942 మందికే అందిన సాయం..

ఖిల్లాఘనపురం మండలంలో నేటి వరకు కేవలం 6,942 మంది రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మండలంలో ప్రతి సంవత్సరం రెండు పంటలకు గాను 15,532 మంది రైతులకు చెందిన 27,697 ఎకరాలకు మొత్తం రూ.13,84,38,537 గతంలో అందిచారు. ప్రస్తుత యాసంగి పంటలకు పెట్టుబడి సాయం ఖాతాల్లో జమచేసే ప్రక్రియను ప్రభుత్వం 2023 డిసెంబర్ 12న ప్రారంభించింది. 25 రోజులు పూర్తయినా ఇప్పటి వరకు 6,942 మంది రైతులకు 4,321 ఎకరాలకు గాను రూ.2,16,06,350 మాత్రమే ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. వరి పంటలు సాగు చేయడం పూర్తవుతున్నప్పటికీ రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమకాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి అన్నంపెట్టే అన్నదాతలకు సకాలంలో పెట్టుబడి సాయం డబ్బులు అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



ఖిల్లాఘనపురం శివారులో ఓ రైతు సాగు చేసిన వరి పంట

త్వరలోనే పూర్తిస్థాయిలో రైతుబంధు..



మండలంలో ఇప్పటివరకు 6,942 మంది రైతులకు రైతుబంధు పథకం ద్వార పెట్టుబడి సాయం అందింది. ప్రభుత్వం త్వరలోనే రైతులందరికీ పెట్టుబడి సాయం అందిస్తుంది. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

– మల్లయ్య, మండల వ్యవసాయ అధికారి, ఖిల్లాఘనపురం

క్లుప్తంగా

కుంగ్‌ఫూ ఇన్‌చార్జ్‌గా నరేందర్



ఆత్మకూర్: న్యూమాంగ్స్ కుంగ్‌ఫూ ఆత్మకూర్ మున్సిపాలిటీ ఇన్‌చార్జ్‌గా బ్లాక్‌బెల్ట్ ఫోర్త్ డాన్ పులినరేందర్‌ను నియమిస్తూ.. రాష్ట్ర అధ్యక్షుడు కనకంమాస్టర్ ఆదివారం నియామక పత్రం అందజేశారు. పట్టణంలో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి వందలాది మంది విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇచ్చామని రాష్ట, జాతీయ స్థాయిలో విద్యార్థులు పథకాలను సాధించారని చెప్పారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు అమర్, రహమతుల్లా, నరేందర్‌గౌడ్, శివకుమార్, కృష్ణ తదితరులు ఉన్నారు.

నోట్‌పుస్తకాలు పంపిణీ



పెబ్బేరు రూరల్: మండలంలోని రాంపురంలో మాజీ సర్పంచ్ గోపాల్‌యాదవ్ ప్రథమవర్ధంతి సందర్భంగా ఆదివారం వారి సతీమని నాగేశ్వరమ్మ, కుమారులు నవీన్‌యాదవ్, ప్రవీన్ యాదవ్ తండ్రి జ్ఞాపకార్థం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలుపంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు, నాయకులు రాజశేఖర్, మజీద్, శ్రీనివాసులు సత్యారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, శర్వయ్య, గ్రామ యువకులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయవంతంపై హర్షం

పాన్‌గల్: ఆరు గ్యారంటీల అమలు కోసం ఎనిమిది రోజుల పాటు ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం మండలంలో విజయవంతంగా ముగిసిందని మండల కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మాజీ జెడ్పీటీసీ రవికుమార్, రాముయాదవ్, బాలరాజుయాదవ్, ఎంపీటీసీ సభ్యులు హైమావతి ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని, నమోదు పూర్తయిన వెంటనే అర్హులను గుర్తిస్తారని అన్నారు. ఇంకా దరఖాస్తులు చేసుకోని వారు ఉంటే, ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవచ్చునని సూచించారు.

మంత్రి జూపల్లి పరామర్శ



పాన్‌గల్: మండలంలోని బండపల్లిస్టేజీ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెల్లరాళ్లపల్లితండాకు చెందిన గౌతమ్‌నాయక్‌ను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు మంత్రి సూచించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని అధైర్య పడవద్దని కుటుంబ సభ్యులకు మంత్రి భరోసా ఇచ్చారు. మంత్రి వెంట మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజునాయక్, యువజన కాంగ్రెస్ నాయకులు రవితేజనాయక్ ఉన్నారు.

తప్పులు లేకుండా వివరాల నమోదు



పాన్‌గల్: ఆరు గ్యారంటీల కోసం ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల వివరాల్లో ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములు ఆపరేటర్లకు సూచించారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ఎనిమిది రోజుల పాటు సేకరించిన దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. మండలంలో మొత్తం 17,030 దరఖాస్తులు వచ్చాయని ఆయా దరఖాస్తులను గ్రామాల వారీగా ఆయాపంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి కంప్యూటర్ ఆపరేటర్లతో వివరాలను నమోదు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో నమోదు విధానాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయంలో నమోదు విధానాన్ని తహసీల్దార్ రాంబాయి పర్యవేక్షణలో ఆన్‌లైన్ నమోదు చేయిస్తున్నారు.

మానవత్వం చాటుకున్న మహిళలు

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని 12వ వార్డుకు చెందిన నేశ శ్రీహరి అనారోగ్యంతో మృతిచెందారు. ఆర్థిక స్థోమతలేని కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న ఆ కాలనీ మహిళలు డబ్బులు పోగుచేసి రూ.11 వేలను జమచేసి మృతుని భార్య లక్ష్మికి అందజేశారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



రిబ్బన్ కట్‌చేసి పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని నాగపూర్‌లో ఆదివారం జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను మాజీ ఎంపీటీసీ నాగం కరుణాకర్‌రెడ్డి, నాగం కృష్ణారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామానికి చెందిన యువకుడు భాస్కరాచారి స్మారకార్థం క్రీడలు ప్రారంభించామని చెప్పారు. ఈ సంవత్సరంతో 20 సంవత్సరాలు చేరుకుందని అన్నారు. మూడు సంవత్సరాలుగా నాగం నిరంజన్‌రెడ్డి స్మారకార్థం సైతం వారి కుమారులు తమవంతు సాయం అందిస్తున్నారని అన్నారు. పోటీల్లో గెలిచిన విజేతకు రూ.30,116, రెండో బహుమతి రూ.15,116 అందిస్తారని అన్నారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, టోర్నీ నిర్వాహకులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని ప్రజలు సైబర్ నేరగాళ్లపై జాగ్రత్తగా ఉండాలని పెద్దమందడి ఎస్‌ఐ హరిప్రసాద్ సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంలో చాలా మంది రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మీ పథకం కోసం దరఖాస్తులు చేసుకుని అధికారులకు ఇచ్చామన్నారు. ఇదే అదునుగా చేసుకుని సైబర్ మోసగాళ్లు మీకు ఇల్లు వచ్చింది మహాలక్ష్మి పథకం డబ్బులు బ్యాంక్ అకౌంట్‌లో పడాలి అంటే మీ మొబైల్‌కు వచ్చే ఓటీపీ చెప్పమని అడిగితే ఎవ్వరూ వారికి ఓటీపీని చెప్పవద్దన్నారు. ఎవరైనా ఓటీపీ చెప్పినట్లయితే మీ అకౌంట్లో డబ్బులు ఓటీపీ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసుకుంటారని వివరించారు. కనుక ప్రజలు తమకు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి ఓటీపీ, బ్యాంక్ వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు.



హరిప్రసాద్, ఎస్‌ఐ

విద్యార్థులకు నాన్‌స్టిక్స్ అందజేత

ఖిల్లాఘనపురం: ఆడపిల్లలకు ఆత్మరక్షణ అవసరమని యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధు అన్నారు. మండల కేంద్రంలోని తెలుగు, ఇంగ్లీష్ మీడియం కస్తూర్బా గాంధీ పాఠశాలల విద్యార్థులకు ఆదివారం నాన్‌స్టిక్ వెపన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు మండల కేంద్రంలో రెండు కేజీబీవీల నుంచి మొత్తం 35 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులు ఈ నెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియం నిర్వహించ బోయే ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను వనపర్తి జిల్లా గోజూరియో కరాటే అండ్ కిక్ బాక్సింగ్ అకాడమి మాస్టర్ కరాటే శేఖర్, మధు అభినందించారు.



విద్యార్థులకు నాన్‌స్టిక్ వెపన్స్ అందజేస్తున్న మధు

కాలనీవాసులు ఆందోళన చెందొద్దు

- టెనెన్సీ వ్యవసాయ భూములకు మాత్రమే వర్తిస్తుంది
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట: పట్టణంలోని రాఘవేంద్ర కాలనీ కొంత కాలంగా వివాదంలో ఉంది. కాలనీకి చెందిన భూమిలో తమకు వాటా వస్తుందని కొత్తకోటకు చెందిన కొందరు వ్యక్తులు కోర్టులో పిటీషన్ వేసి కోర్టు ఆదేశానుసారం రెవెన్యూ అధికారులతో సర్వే చేయించారు. కాలనీకి చెందిన భూమి టెనెన్సీ ప్రకారం తమకు వాటా వస్తుందని కాలనీలోని ఇళ్ల వారికి నోటీసులు ఇవ్వడంతో ఆందోళనకు గురయ్యారు. దీంతో కాలనీ వాసులందరూ కోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చారు. రాఘవేంద్ర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రారంభోత్సవానికి అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. కాలనీవాసుల ఆహ్వానం మేరకు వచ్చిన ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు ఎమ్మెల్యేను పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. అనంతరం కాలనీవాసులు కాలనీకి చెందిన భూ సమస్య గురించి ఎమ్మెల్యేకు వివరించారు. అందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ.. టెనెన్సీ అనేది చట్ట ప్రకారం వ్యవసాయ భూములకు మాత్రమే వర్తిస్తుందని, వ్యవసాయేతర భూమిగా మార్చి అనుమతులు తీసుకుని ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ఏళ్లు గడుస్తుంది.. కాబట్టి కాలనీవాసులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పి.విశ్వేశ్వర్, రావుల జితేంద్రనాథ్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రశాంత్, బోయేజ్, పి.కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, లతీఫ్, సలీంఖాన్, ముజీబ్, వెంకటేష్, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.



రాఘవేంద్రస్వామి చిత్రపటాన్ని ఇస్తున్న కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

ఫ్లెక్సీ గొడవ..

రాఘవేంద్ర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా అసోసియేషన్ సభ్యులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి(జీఎమ్మార్)తో పాటు స్థానికంగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకుల ఫొటోలను ముద్రించారు. దీంతో స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు ఒకింత ఆగ్రహానికి లోనయ్యారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ఫొటోలు లేకుండా.. బీఆర్‌ఎస్ నాయకుల ఫొటోలు ఏ విధంగా వేస్తారని అసోసియేషన్ సభ్యులపై మండిపడ్డారు. చివరకు ఎమ్మెల్యే జోక్యం చేసుకుని కాంగ్రెస్ కార్యకర్తలను, నాయకులను సముదాయించడానికి చాలా సమయం పట్టింది. ఉదయం 11గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమంలో ఫొటోల రగడ కారణంగా మధ్యాహ్నం 1గంట30నిమిషాలకు ప్రారంభమైంది.



ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



పాన్‌గల్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మహేష్‌నాయక్ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్, తండా సర్పంచ్ శాంతమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం మహేష్‌నాయక్ మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హైదరాబాద్‌లో కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్న కుటుంబం ప్రజాపాలన దరఖాస్తు చేసుకునేందుకు వచ్చి మృత్యువాత పడటంతో పేద కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయిందన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా ఆర్థిక సాయంతో పాటు భూమి కేటాయించాలన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రూ.30 వేలు ఆర్థిక సాయం

తమ వంతు సాయంగా బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం చెక్కును, ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గౌతమ్‌నాయక్‌కు మెరుగైన వైద్యం నిమిత్తం రూ.20 వేలు నగదు అందజేసినట్లు పేర్కొన్నారు. ఆయా కుటుంబాలను ఆదుకునేందుకు తమ వంతు సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రాజునాయక్, బాబునాయక్, చిట్టెమ్మ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన దాసరి జంగయ్య, పోతులోని శేషమ్మలు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ నాయకులు సాయిచరన్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. రూ.5 వేల చొప్పున రెండు కుటుంబాల సభ్యులకు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, క్యామ రాజు, ప్రకాష్, రమేష్, బాబు, పోలిశెట్టి శ్రీను, లింగస్వామి, బాలయ్య, ఆంజనేయులు, రమేష్, శేఖర్, చంద్రమౌళి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, మధ్యలో చదువు మానేసిన పిల్లలను పాఠశాలలకు పంపాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్ కోరారు. ఆదివారం ఆత్మకూర్ మండలంలోని తిప్డంపల్లిలో బడిబయట పిల్లల సర్వే నిర్వహించారు, బడిబాట కార్యక్రమం ఆదివారంతో ముగిసిందని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సీఆర్‌పీ సౌమ్యరాణి ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించారు. చదువు ప్రాముఖ్యతను వివరిస్తూ.. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.



‘కార్యకర్తలకు అండగా ఉంటా’



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారని, ప్రతికార్యకర్తకు అండగా ఉంటామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కత్తేపల్లికి చెందిన సీనియర్ నాయకుడు దోమశ్రీనివాస్‌రెడ్డి ఇటివలే తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడని, ఇటీవల కోలుకుని ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యానికి అయిన ఖర్చులను అందించేందుకు కృషి చేస్తానని, ఆపద సమయంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్, రహ్మతుల్లా, తల సిరాజ్‌యాదవ్, గద్దంశ్రీనివాస్‌యాదవ్, ఈర్లదిన్నె శ్రీను, అజ్మతుల్లా, గంగా, అబ్దుల్, మహిపాల్‌రెడ్డి, గుండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘బతుకు నానీ’లు పుస్తకావిష్కరణ

అమరచింత: బతుకు నానీలు పుస్తకాన్ని మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డి చేతులమీదుగా ఆదివారం ఆవిష్కరించినట్లు పట్టణానికి చెదిన రచయిత, యువకవి ఉప్పరి తిరుమలేష్ తెలియజేశారు. బతుకు నానీల పుస్తకాన్ని దేశాయి ప్రకాష్‌రెడ్డికి అంకితమిచ్చామన్నారు. ఇప్పటివరకు పలు పుస్తకాలను రచించానన్నారు. ప్రస్తుతం ఎనిమిదో కవితా సంపుటి బతుకు నానీలు రచించినట్లు చెప్పారు. పట్టణానికి చెందిన యువకవి మంచి సాహిత్యంతో కూడిన నానీలను రచించడం సంతోషకమని దేశాయి ప్రకాష్‌రెడ్డి అన్నారు. అమరచింత సంస్థాన కాలం నుంచి సాహిత్యానికి పుట్టినిల్లుగా ఉందన్నారు. తిరుపతి వెంకట కవులను ఢీకొట్టిన ఘనత అమరచింత సంస్థాన కవులకు ఉందన్నారు. కార్యక్రమంలో దేశాయి అనుసూయమ్మ, గీతారెడ్డితో పాటు కవి తెలుగు తిరుమలేష్ పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో పాల్గొన్న దేశాయి ప్రకాష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో అమరచింత కవులు

రామయ్య అక్షతలకు పూజలు



కానాయపల్లికి అక్షతలు తీసుకెళ్తున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమన్ననాయుడు



ఆత్మకూర్‌లో విరాళాలు సేకరిస్తున్న వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు

కొత్తకోట రూరల్: అయోధ్య రాముడి పూజిత అక్షతలు కొత్తకోటకు చేరుకున్నాయి. అక్కడి నుంచి ప్రజలకు తమ గ్రామాలకు పూజిత అక్షతలను ఊరేగింపుగా తమ గ్రామాలకు తీసుకెళ్లారు. మండల పరిధిలోని కానాయపల్లికి రాముడి పూజిత అక్షతలను బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమన్నాయుడు, గ్రామస్తులతో కలిసి కొత్తకోట నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి అక్షతలను గ్రామస్తులకు అందజేస్తామని, ఈ నెల 22న తమ ఇళ్లలోనే రాములోరికి అక్షతలు వేసి పూజలు చేయాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో హోటల్ రాజు, డీలర్ శ్రీనివాసులు, గోవర్దన్ నాయుడు, నాగరాజు, రాములు తదితరులు ఉన్నారు.

ఆత్మకూర్: అయోధ్యలో నూతన రామమందిర ప్రారంభోత్సవం, శ్రీరాముడి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా అక్షతలను ఆదివారం ఆత్మకూర్‌లో ఇంటింటికీ చేరవేశారు. స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమానికి సంబంధించి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా 22వ తేదీన ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి దీపావళి పండుగను జరుపుకోవాలని నాయకులు కోరారు. రామమందిర ట్రస్ట్ పంపిన అక్షతలు ఆత్మకూర్‌లో ఊరేగింపు నిర్వహించి ఇంటింటికీ పంచిపెడుతున్నామని తెలిపారు. 22న ఆయోధ్యలో విగ్రహ ప్రతిష్టాపన కొనసాగే సందర్భంగా ఇళ్లల్లో పూజలు నిర్వహించుకోవాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అశ్విన్‌కుమార్, తమ్మలి విజయ్, మాస్టర్‌బాలు, మ్యాడం శ్రీను, నర్సింహరెడ్డి, దోమశ్రీను, ప్రవీణ్, కొండాపురం రాము, తోటరవి, లింగన్న, బాలకృష్ణ, దివాకర్, కురుమూర్తి, బాలు, గాడిశేషు, రఘుయాదవ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పెబ్బేరు రూరల్: మండలంలోని గుమ్మడం ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పలువురు విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో భాగంగా ఒకేవేదికపై కలుసుకున్నారు. జీవితంలో వివిధ స్థాయిల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆనాటి మధుర స్మృతులను నెమరు వేసుకోవడంతో పాటు అప్పటి ఉపాధ్యాయులు సూర్యనారాయణ, కె.నాగిరెడ్డి, వి.స్వామి, ఎ.రంగారెడ్డిలను విద్యార్థులు సన్మానించారు. పాఠశాలకు సహాయ, సహకారాలు అదించాలని నిర్ణయించారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆంజనేయులు, కురుమయ్య, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న స్వామి ఉత్సవాలు



మూలమల్లలో బీరప్పస్వామి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అమరచింత: పట్టణంలో వెలిసిన మల్లన్న స్వామి దేవర ఉత్సవాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సమీపంలోని కృష్ణానదికి వెళ్లి దేవతామూర్తుల విగ్రహాలను అభిషేకించి అక్కడే పూజలు నిర్వహించి జల్దీ బిందెలతో పట్టణంలో ఉత్సవ దేవర్ల విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కురుమ సంఘం నాయకులు మాట్లాడారు. ప్రతి సంవత్సరం మల్లన్న దేవర్లను సంక్రాంతి పండుగకు ముందు నిర్వహించడం అనాధిగా వస్తున్న ఆనవాయితీ అని వెల్లడించారు. ఈ సంవత్సరం ఆలయంలో ఉత్సవాలను నిర్వహించామన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

ఆత్మకూర్: గొల్ల, కురుమ యాదవుల ఆరాధ్యదైవం బీరప్ప దేవర ఉత్సవాలను ఆదివారం ఆత్మకూర్ మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. ఆత్మకూర్, అమరచింతలో కొనసాగే ఉత్సవాల్లో భాగంగా స్వామివారి మూలవిరాట్ విగ్రహాలను పల్లికిలో ఊరేగిస్తూ.. మూలమల్ల మీదుగా కృష్ణానదిలో జలాభిషేకం నిర్వహించారు. ఆలయాల్లో విగ్రహ మూర్తులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. కులపెద్దలు మల్లప్ప, బీరప్ప, ఈదన్న, శ్రీను, మల్లేష్, గొల్ల, కురుమ యాదవులు ఉన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతు

ఆత్మకూర్: మిషన్ భగీరథ మేయిన్ పైప్‌లైన్ లీకేజీ అవడంతో మరమ్మతులు చేపడుతున్నారు. వారం రోజులుగా ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి మరమ్మత్తు పూర్తిచేశారు. మరమ్మతు కారణంగా రోడ్డుపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సోమవారం గుంత పూడ్చి వేయిస్తామని రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు రానివ్వమని కమిషనర్ నాగరాజు తెలియజేశారు.



మరమ్మతు కోసం తీసిన గుంత